# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-01-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి నాలుగు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు.**

2. **రహదారి ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ భద్రత కల్పించేందుకు వీబీ జీ రామ్ జీ పథకం ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **రెండు తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి నాలుగు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు. తన స్వగ్రామమైన నారావారిపల్లెలో జరిగే సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన నిన్న సాయంత్రం నారావారిపల్లెకు చేరుకున్నారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో ఈ రోజు పాల్గొంటారు. అనంతరం  నారావారిపల్లెతో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు. నారావారిపల్లెలో విద్యుత్ ఉపకేంద్రంతో పాటు, నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సంజీవని ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అలాగే తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర రామ్‌నారాయణ్ – రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి సహాయకుల వసతి సముదాయం, ఎస్వీ విశ్వవిద్యాలయంలో నిర్మించిన విద్యార్థి వసతి  గృహాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

రహదారి ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లోని యూసుఫ్‌గూడలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అ రైవ్ – అ లైవ్' రహదారి భద్రత ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు హైడ్రా తరహా వ్యవస్థ ను అందుబాటులోకి తీసుకురానున్నామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పేర్కొంటూ..

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నామని పశుసంవర్ధక శాఖా మంత్రి  కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను, కరపత్రాలను విజయవాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిన్న ఆవిష్కరించారు.  ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం అపారమైన పశు సంపదకు నిలయం అని, ప్రసిద్ధి చెందిన ఒంగోలు, పుంగనూరు గోజాతులు, నెల్లూరు, మాచెర్ల గొర్రెల జాతులు, అలాగే ఆశిల్ జాతి కోళ్లు  ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నియంత్రణ, పశుపోషణ ఖర్చుల తగ్గింపు, శాస్త్రీయ పశుపోషణపై ఈ శిబిరాల ద్వారా అవగాహన కల్పించనున్నామని చెప్పారు. వీటిని పశుపోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ భద్రత కల్పించేందుకు వీబీ జీ రామ్ జీ పథకం ఉపయోగపడుతుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన  పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ,  కొత్త పథకంపై జరుగుతున్న దుష్ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇప్పటివరకు ఉన్న 100 పని దినాలను 125 రోజులకు  పెంచడం జరిగిందని కేంద్ర మంత్రి  పేర్కొంటూ,

వాయిస్..  30  సెకన్లు

---------------------------

రెండు తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారానికి ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన నిన్న ఒక వీడియో సందేశం ద్వారా స్పందిస్తూ, సముద్రంలో కలిసే  నీటినే ప్రభుత్వం వినియోగించుకుంటుదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం పోలవరం – నల్లమల సాగర్‌కు ఎటువంటి  అభ్యంతరాలు తెలపకుండా సహకరించాలని మంత్రి కోరారు.

ఇక పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో తెలంగాణ  వేసిన పిటిషన్ ను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.  పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని ఆర్టికల్ 131, సివిల్ సూట్ రూపంలో మళ్లీ రావాలన్న ఉన్నత న్యాయస్థానం సూచనల మేరకు పిటిషన్ ఉపసంహరించుకున్నట్లు  తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

---------------------------

తెలంగాణలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ “వీబీ జీ రామ్ జీ” పథకంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కొత్త చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. శ్రామికుల  పేరుతో నకిలీ ఉద్యోగ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశమని చెప్పారు. వ్యవసాయ సీజన్ లో శ్రామికుల కొరత లేకుండా, వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామని తెలిపారు.

---------------------------

'ప్రకృతి' ప్రాధాన్యతను తెలియజేసే పండుగ సంక్రాంతి అని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో మాజీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆత్మనిర్భర్ సంక్రాంతి' వేడుకల్లో ఆయన నిన్న పాల్గొని ప్రసంగించారు. ఈ పండగకు స్వగ్రామాలకు వెళ్లలేని వారికి ఇలాంటి వేడుకలు ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. సంక్రాంతి కేవలం పండుగ కాదని, ప్రకృతి తత్వాన్ని బోధించే పర్వదినమని పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

సంక్రాంతి రద్దీ నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్వే అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని సికింద్రాబాద్‌లో రైలు నిలయంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్ల రైల్వే మేనేజర్లతో ఆయన నిన్న దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, పండగ నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రయాణికులకు అందించాలన్నారు. రైల్వే ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహించాలని ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే 139 రైల్వే మదద్ సహాయ కేంద్రం, లేదా రైల్ వన్ యాప్ ద్వారా వెంటనే సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

---------------------------

గుంటూరు జిల్లా తెనాలిలో అరుదైన మొక్కలతో "ఫైకస్ పార్కును అందుబాటులోకి తెచ్చామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలోని ఐతానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "ఫైకస్ పార్క్ ను మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉదయం, సాయంత్రం ప్రజల నడకకు వీలుగా జపనీస్ తరహా వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా నాలుగు రోజుల పాటు సందర్శకులను పార్కులోనికి అనుమతించడం జరుగుతుందని, పనులు మొత్తం పూర్తయ్యాక అధికారికంగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు మంత్రి తెలియజేశారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడిందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడురోజులపాటు కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 12.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలోని ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

=====================